సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 4 । జూలై । 2024



ప్రత్యామ్నాయాలతో అధిక దిగుబడి

సార్వా వరిలో ప్రత్యామ్నాయ రకాలైన శ్రావణి, చంద్ర, ఎంటీయూ 1,273 రకాల సాగుతో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



'పీఎం సూర్యఘర్'తో వెలుగులు

కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని. దీనికి మంచి స్పందన వస్తోందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. 8లో ▸



పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ఏలూరు శనివారపుపేట శ్రీరామ్‌నగర్‌లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై నగర కమిషనర్ స్పందించారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఏటిగట్టు పనుల పరిశీలన



నరసాపురంలో వశిష్ట ఏటిగట్టు పనులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం: వరదలు వచ్చినా కూడా ఇబ్బంది లేకుండా నరసాపురంలో ఏటిగట్టు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కలెక్టర్ సి.నాగరాణి చెప్పారు. నరసాపురం పట్టణ పరిధిలోని పొన్నపల్లి ప్రాంతంలో జరుగుతున్న ఏటిగట్టు అభివృద్ధి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2022లో 22 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చిపడటంతో పొన్నపల్లి వద్ద ఏటిగట్టుకు గండి పడిందని చెప్పారు. ప్రస్తుతం ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు, వరదలు ఎక్కువగా ఉండే చాన్స్ ఉన్నట్టు వాతావరణశాఖ సూచించడంతో అప్రమత్తమయ్యామని పేర్కొన్నారు. 25 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చినా కూడా ఏటిగట్టు కుంగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. పనులు రూ.25 కోట్లతో చేపట్టామని వివరించారు. 250 మీటర్లు మేర రివిట్‌మెంట్ పనులు పూర్తయ్యాయన్నారు. నరసాపురంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న డ్రెయినేజీ పనులు పరిశీలించానని, పనుల నాణ్యతతో జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

8న ఐటీఐ జాబ్‌మేళా

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ఈ నెల 8న ఉదయం 10 గంటల నుంచి ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్, జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు బుధవారం తెలిపారు. ఈ మేళాలో ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఐటీఐల్లో వివిధ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐకి వచ్చి హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9676099988, 8886339966 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన జంతు హక్కుల పరిరక్షణ పక్షోత్సవాలు



జంతు హక్కుల పరిరక్షణ పక్షోత్సవాల దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజల్లో జంతువుల పట్ల ప్రేమ అనురాగాలపై అవగాహన కల్పిస్తూ జంతువులకు ఉండే హక్కులను పర్యవేక్షిస్తూ ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలను చేపట్టిందని జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే మురళీకృష్ణ అన్నారు. జంతు హక్కుల పరిరక్షణ పక్షోత్సవాల ముగింపు వేడుకలను జిల్లా పశు సంవర్ధక శాఖ, జిల్లా జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భీమవరం పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించారు. పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ 15 రోజుల పాటు అవగాహన సదస్సులు, ర్యాలీలు, విద్యార్థులకు పోటీలను నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జావార్ హుస్సేన్, అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వం, పాఠశాల విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో పని చేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులు నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్ డాట్ ఎడ్యుకేషన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 15 వరకూ అవకాశముందన్నారు. షార్ట్‌లిస్ట్ అయిన ఉపాధ్యాయుల వివరాలను వెబ్‌సైట్‌లో ఆగస్టు 5 నుంచి 6 వరకు పొందుపరుస్తారన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించాలి

ఏలూరు(మెట్రో): అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించి అభ్యర్థులు, వారి తరపున ఏజెంట్లు, నియోజకవర్గ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ నివేదికలపై పరిశీలకులైన గౌరవ్ మధుకర్, టి.జోర్డాన్ బూటియాతో కలిసి జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి సమావేశం నిర్వహించారు.

రుణాల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

- 258 సొసైటీలు, 34 డీసీసీబీ బ్యాంకుల ద్వారా వసూళ్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదుగురు ఏజీఎంల నియామకం
- ఇప్పటికే 77 శాతం రికవరీ

ఏలూరు(మెట్రో): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ రుణాలు, వ్యవసాయేతర రుణాల వసూళ్లకు డీసీసీబీ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటుచేశారు. ఈ డ్రైవ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా రుణాలు రికవరీ చేసి అనంతరం తిరిగి రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రస్తుత జాయింట్ కలెక్టర్ డీసీసీబీ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తుండటంతో డీసీసీబీకి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవానికి జూన్ 30 నాటికి రుణాల రికవరీ పూర్తిచేసి జూలైలో నూతన రుణాలు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలి. ఎన్నికల నేపథ్యంలో రుణాల రికవరీ ఆలస్యమైంది. ప్రత్యేకించి జూలైలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశాలు జారీ చేశారు.

గతేడాది రూ.1400 కోట్ల పంట రుణాల మంజూరు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 258 సొసైటీలు, 34 డీసీసీబీ బ్యాంకుల ద్వారా టర్మ్ రుణాలు రూ.300 కోట్లు, పంట రుణాలు రూ. 1400 కోట్లను గత ఏడాది అందించారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో రుణాల రికవరీ ప్రత్యేక డ్రైవ్ ముగిసిన అనంతరం ఈ ఏడాది రుణ ప్రణాళిక అమలు చేయనున్నారు. తద్వారా ఈ ఏడాది రైతులకు పంట రుణాలు, వ్యవసాయేతర రుణాలు(టర్మ్ రుణాలు) అందించేందుకు మార్గం సుగమమవుతుంది. జిల్లా వ్యాప్తంగా జూన్ 30 నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు 77 శాతం రికవరీ పూర్తిచేశామని డీసీసీబీ సీఈవో నారా తిలక్ తెలిపారు. ప్రత్యేకించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లో ఐదురుగు ఏజీఎంలు విధులు నిర్వహిస్తున్నారు. వీరు ప్రతిరోజు రుణాల రికవరీపై ప్రత్యేక చర్యలు తీసుకుంటూ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తారు.



డీసీసీబీ బ్యాంకు

రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ ఆధ్వర్యంలో 258 సొసైటీలు, 34 బ్రాంచ్‌ల్లో పేరుకుపోయిన రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం ఐదుగురు ఏజీఎంల ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. 77 శాతం రుణాల రికవరీ ఇప్పటికే పూర్తయ్యింది. పూర్తిస్థాయిలో రుణాల రికవరీ తర్వాత నూతన రుణ ప్రణాళిక అమలు చేసి జిల్లాలో రైతులకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్

రికవరీ అనంతరం రుణప్రణాళిక అమలు

త్వరలో రుణాలు రికవరీ ప్రక్రియను, ప్రత్యేక డ్రైవ్‌ను ముగించి డీసీసీబీ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రుణ ప్రణాళికను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రుణాలు రికవరీ పూర్తయిన అనంతరం ఈ ఏడాది కొత్తగా రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే జూన్ 30 నాటికి వార్షిక క్యాలెండర్ ముగియడంతో ప్రస్తుతం రికవరీ అనంతరం నూతన రుణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటారు.

చిరుతపులి సంచారం



సున్నాలగండి ప్రాంతంలో చిరుత దాడిలో మృతిచెందిన మేక

పోలవరం రూరల్: చిరుతపులి సంచారంతో ఏజెన్సీలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. పోలవరం మండలం వింజరం పంచాయతీ పరిధిలోని సున్నాలగండి, మెత్తాపు కోట గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తోంది. ఇప్పటికే రెండుసార్లు ఆ ప్రాంతంలోని మేకలను చంపేసింది. బుధవారం సున్నాలగండి గ్రామానికి చెందిన మడకం పుల్లారావుకు చెందిన మేకను ఈడ్చుకెళ్లి చంపింది. పుల్లారావు మేక కళేబరాన్ని గుర్తించి అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలవరం అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్.దావీదురాజు ఆదేశాలతో సిబ్బంది సున్నాలగండి ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో మృతిచెందిన మేకను పరిశీలించారు.

ఆక్వా దుకాణాలపై మెరుపు దాడులు



ఆక్వా దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

కైకలూరు: ఆక్వా రంగానికి హాని కలిగించే నిషేధిత యాంటీ బయాటిక్స్ మందుల విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. గత నెల 21న కైకలూరులో పలు దుకాణాలపై అధికారులు దాడులు చేసి నిషేధిత మందులను గుర్తించారు. అయినప్పటికీ దుకాణదారుల్లో మార్పు రావడం లేదు. తాజాగా కలిదిండి, కోరుకొల్లు గ్రామాల్లో నాలుగు అక్వా దుకాణాలపై మత్స్యశాఖ, ఎంపెడా, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆకస్మికంగా బుధవారం తనిఖీ నిర్వహించారు. వినాయక ఎంటర్‌ప్రైజెస్, శ్రీ సాయి ఏ టూ జెడ్ ఆక్వా బజార్, శ్రీ కార్తికేయ ఆక్వా ల్యాబ్, ఆక్వా షాప్, శ్రీహరిత ఆక్వా ల్యాబ్‌లపై దాడులు చేశారు. వీటిలో వినాయక ఆక్వా దుకాణంలో నిషేధిత మందులు గుర్తించడంతో రూ.1.25 లక్షలు, కార్తికేయ ఆక్వా ల్యాబ్‌లో నిషేధిత మందులు, నిబంధనలు పాటించని కారణంగా రూ.25 వేలు జరిమానా విధించారు. కార్తికేయ ఆక్వా ల్యాబ్‌కు అనుమతులు తీసుకుని ఏకంగా ఆక్వా దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇక్కడ ల్యాబ్‌లో వివిధ టెస్టులు చేసి దుకాణంలో రైతులకు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిని తీవ్ర నేరంగా పరిగణిస్తామని మత్స్యశాఖ అధికారులు చెప్పారు. ఏడీ చాంద్‌బాషా మాట్లాడుతూ దుకాణదారులు విక్రయించే నిషేధిత మందుల వల్ల మొత్తం ఆక్వారంగం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఎంపెడా టెక్నికల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీచ్‌టూల్ శిక్షణతో మెరుగైన బోధన



టీచ్‌టూల్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ అబ్రహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టీచ్‌టూల్ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందించడానికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్‌టూల్ శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల వైఖరులను గమనించడం ఉపాధ్యాయులకు తేలిక అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఏలూరు ఎంఈఓ 2 ఆర్.రంగయ్య, మాస్టర్ ట్రైనర్స్ ఎంఏ సత్యనారాయణ, వహీదా బేగం, జయకుమార్, స్వర్ణలత, సీఆర్‌టీసీటీలు పాల్గొన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన



మొగల్తూరు మండలం మోళ్లపర్రులో ఉప్పుటేరును పరిశీలిస్తున్న కలెక్టర్ సి.నాగరాణి

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గంలో బుధవారం కలెక్టర్ సి.నాగరాణి సుడిగాలి పర్యటన చేశారు. సీతారామపురంలోని అలంకృతి లేస్ పార్కు, రుస్తుంబాద అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్లను సందర్శించి లేసు ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లేసు లేసు అల్లికలు అల్లే మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. లేసు పార్కు అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కలెక్టర్ చెప్పారు. మండలంలోని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన పెదమైనవానిలంక గ్రామంలోని డిజిటల్ కమ్యూనిటీ భవనాన్ని సందర్శించారు. అక్కడ శిక్షణను పరిశీలించారు. డిజిటల్ భవనం ప్రారంభించిన నాటి నుంచి ఇంత వరకూ ఏ శిక్షణ ఎంతమంది తీసుకున్నారని ఆరా తీశారు. శిక్షణ పొందిన వారి ప్లేస్‌మెంట్‌లు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఎంతమంది శిక్షణ పొందారు, ప్రస్తుతం ఎన్నో బ్యాచ్ నడుస్తుందని అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేశారు.

మొగల్తూరు మండలం మోళ్లపర్రులో..

మొగల్తూరు మండలంలోని మోళ్లపర్రులో ఉప్పుటేరు మొగ సముద్రంలో కలిసే ప్రాంతాన్ని సందర్శించి ఆమె పూడిక తీత పనులకు సంబంధించి తక్షణ ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో కలెక్టర్ వెంట అర్డీవో అచ్యుత అంబరీష్ తదితరులు ఉన్నారు.

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్



పోలవరం పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

పోలవరం రూరల్: ఏలూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్టును పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారుల నుంచి పనులు జరుగుతున్న వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై ఈఈ పి.వెంకటరమణ మ్యాప్ ద్వారా ప్రాజెక్టు పనులను చూపించి వివరించారు. ప్రాజెక్టు సైట్‌లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మోడల్ గ్యాలరీని తిలకించి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టులో ఏయే పనులు జరిగాయి. ఎంత వరకు పూర్తయ్యాయి అనే విషయాలను కలెక్టర్ తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్‌లు ఉన్నారు.

దిశ వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ బుధవారం దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. తాత్కాలిక వసతి గృహంలో ఉన్న బాధితులకు అందిస్తున్న వసతులు అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ పోర్టల్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ నిర్మల, స్టాండింగ్ కౌన్సిల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అభివృద్ధికి పాటుపడదాం

- మేయర్ నూర్జహాన్
- నగర పాలక కౌన్సిల్ సమావేశంలో 11 అంశాల ఆమోదం


ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సమష్టిగా పనిచేద్దామని, మీ అందరి సహకారంతో ప్రజలకు అత్యంత మెరుగైన రీతిలో సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ చెప్పారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 11 అంశాలపై సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. నగర ప్రజలకు తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, మరమ్మతులు, అద్దె భవనాల్లోని సచివాలయాలకు అద్దె చెల్లింపులు, కార్పొరేషన్‌కు ఆదాయాన్ని సమకూర్చేందుకు బీపీసీఎల్ పెట్రోల్ బంక్ డీలర్‌షిప్ తీసుకోవడం తదితర అంశాలపై నగరపాలక కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అజెండాలోని 11 అంశాలపై సభ్యులెవరూ మాట్లాడలేదు. గతంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు స్వపక్షంలో విపక్షంలా అజెండాలోని అంశాలపై ప్రశ్నించే పరిస్థితి ఉండేది. తాజాగా సభ్యుల్లో మార్పు స్పష్టంగా కనిపించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన బడేటి రాధాకృష్ణ (చంటి)ని కార్పొరేటర్లంతా మర్యాదపూర్వకంగా కలిసి నగర అభివృద్ధికి తామంతా పూర్తిగా సహకరిస్తామని, నగర అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో సర్వసభ్య సమావేశంలోనూ సభ్యులంతా సమష్టిగా ఆమోదం తెలుపుతూ నగర అభివృద్ధికి పాటుపడతామనే ధోరణిలో వ్యవహరించారు.



ఏలూరు కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ షేక్ నూర్జహాన్

డిగ్రీ కోర్సులు సరికొత్తగా..

- ఉపాధికి ఊతమిచ్చేలా రూపకల్పన
- కంప్యూటర్ ఆధారిత కోర్సులతో కొత్త పుంతలు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఒకప్పుడు డిగ్రీ చేస్తే గొప్పగా చెప్పుకునేవారు. కాలక్రమంలో డిగ్రీ కోర్సులకు డిమాండ్ తగ్గి ఇంజినీరింగ్ కోర్సుల వైపు యువత మొగ్గుచూపారు. ఇంజినీరింగ్ కోర్సులు చేస్తే ఏదొక ఉద్యోగం వస్తుందనే నమ్మకం, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు డిమాండ్‌తో డిగ్రీ కోర్సుల్లో చేరేవారు తగ్గిపోయారు. ఇప్పుడు డిగ్రీలో కూడా కొత్త కోర్సులను ప్రవేశపెట్టి డిగ్రీ కోర్సులతో కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సంపాదించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల్లో వినూత్న కోర్సులు విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రస్తుతం డిగ్రీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరుగుతుండడంతో విద్యార్థులు ఈ కోర్సుల వైపు అడుగులు వేయవచ్చు.

అందుబాటులోకి ఆనర్స్ డిగ్రీ

సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో మార్పులు వచ్చాయి. ఇంజినీరింగ్‌కు దీటుగా మార్పులు చేశారు. మూడేళ్ల కాలానికి సాధారణ డిగ్రీ, నాలుగేళ్లకు ఆనర్స్ డిగ్రీ సర్టిఫికెట్లు అందుబాటులోకి వచ్చాయి. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేసి, ఉపాధికి బాటలు వేసేలా కోర్సులను రూపొందించారు. ఈ కోర్సుల్లో భాష, సాంకేతిక నైపుణ్యాలతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంచేలా ఇంటర్న్‌షిప్, పారిశ్రామిక శిక్షణను అంతర్భాగం చేశారు. ఇవి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు వరంగా మారాయి.

సెమిస్టర్ విధానంతో పర్యవేక్షణ

ప్రభుత్వ కళాశాలల్లోనూ డిగ్రీ కోర్సులు ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి, ఇంటర్‌లో ఆంగ్ల మాధ్యమంలో చదివిన విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా డిగ్రీలో అదే మాధ్యమాన్ని కొనసాగించవచ్చు. ఆ భాషా నైపుణ్యంతో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని కార్పొరేట్ కొలువులు సాధించే స్థాయికి చేరుకోవచ్చని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. సెమిస్టర్ విధానం అమలులోకి రావడం, పరీక్షలు, మూల్యాంకనం ద్వారా విద్యార్థి అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు అధ్యాపకులు పర్యవేక్షించడం వల్ల విద్యార్థులు ఉత్తమ అవకాశాలను అందుకోగలుగుతారు.

కంప్యూటర్ కోర్సులతో కొత్త పుంతలు

డిగ్రీలో కంప్యూటర్ ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టడంతో డిగ్రీ చదువులు సైతం కొత్త పుంతలు తొక్కుతున్నాయి. సంప్రదాయ కోర్సులతో పాటు కంప్యూటర్ ఆధారిత కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కోర్సుల్లో చేరి విజయవంతంగా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మూడేళ్లకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించే అవకాశం ఉంటుంది.

డిగ్రీ కోర్సుల్లో మార్పులు

1. సంప్రదాయ కోర్సులైన బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి మార్పులు చేసింది. పీజీలోలా పూర్తిగా ఒక సబ్జెక్టు చదివేలా డిగ్రీ కరిక్యులమ్‌తో పాటు సిలబస్‌లో మార్పులు చేశారు.
2. బీఎస్సీ లైఫ్‌సైన్సెస్‌లో బోటనీ, జువాలజీ, ఆక్వా కల్చర్, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, హోమ్ సైన్స్, న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ కోర్సులతో పాటు బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్ వంటి కోర్సులను అందుబాటులోకి తెచ్చారు.
3. బీఏలో ఫైనాన్షియల్ ఎకనామిక్స్, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరరీ స్టడీస్, తెలుగు భాష–సాహిత్యం, పొలిటికల్ సైన్స్ కోర్సులను తెచ్చారు.
4. బీకాంలో జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్, బ్యాంకింగ్–ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.

ప్రత్యామ్నాయ రకాలతో అధిక దిగుబడులు

ఏరువాక కేంద్రం ఏలూరు సమన్వయకర్త డాక్టర్ కె.ఫణికుమార్



ఏలూరు (మెట్రో): ఉభయగోదావరి జిల్లాల్లో సార్వా వరి సాగులో స్వర్ణ, ఎంటీయూ 1,318, సంపద స్వర్ణ వంటి సంప్రదాయ రకాలు సాగు చేస్తున్నారని, అయితే వీటికి ప్రత్యామ్నాయంగా శ్రావణి, చంద్ర, ఎంటీయూ 1,273 రకాల వంగడాలను కూడా సాగు చేసుకుని అధిక దిగుబడులు పొందాలని ఏరువాక కేంద్రం ఏలూరు సమన్వయకర్త డాక్టర్ కె.ఫణికుమార్ రైతులకు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రావణి (ఎంటీయూ 1,239), చంద్ర (ఎంటీయూ 1,153), ఎంటీయూ 1,273, ఎంటీయు 1,232 రకాల సాగు చేసే విధానాలను వివరించారు.

శ్రావణి

సార్వాలో ఎంటీయూ 1,318, స్వర్ణ, ఎంటీయూ 1,064, ఎంటీయూ 1,061, సంపద స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా సాగు చేయదగ్గ తెలుపు గింజ రకం వంగడం శ్రావణి. 140 రోజుల పంటకాలం కలిగి ఉంటుంది. కాండం ధృడంగా ఉండి చేను పడిపోదు. రెండు వారాల నిద్రావస్థ ఉండటం వల్ల అధిక వర్షాల సమయంలో గింజ మొలకెత్తదు. దోమపోటు. ఎండాకు తెగుళ్లను తట్టుకుంటుంది. సగటు దిగుబడి హెక్టారుకు 7 టన్నులు.

చంద్ర

ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపు వల్ల సార్వా ఆలస్యమయ్యే ప్రాంతాలలో సాగుచేయడానికి అనువైన ఎంటీయూ 1,010 రకానికి ప్రత్యామ్నాయంగా సాగు చేయదగ్గ స్వల్పకాలిక వంగడం చంద్ర. దీని పంట కాలం 115 రోజులు. గింజ పొడవుగా, లావుగా ఉంటుంది. బియ్యం పొట్ట తెలుపు లేకుండా పారదర్శకంగా ఉండి, గింజ రాలడం తక్కువ. సగటు దిగుబడి హెక్టారుకు 7.5 టన్నులు. దోమపోటు, అగ్గి తెగులును తట్టుకుంటుంది.



డాక్టర్ కె.ఫణికుమార్

ఎంటీయూ 1,273

ఉమ్మడి జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పీఆర్ 126, ఎస్ఎల్ 10, ఎంటీయూ 1,064, ఎంటీయూ 1010 రకాలకు ప్రత్యామ్నాయమైన వంగడం ఈ ఎంటీయూ 1,273. దీని గింజ పొడవు 6.66 మి.మీ కలిగి, కాకినాడ పోర్ట్ ద్వారా ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేయడానికి అనువైన రకం. 120 రోజుల కాల పరిమితి కలిగి, చేను పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి, గింజ రాలడం తక్కువగా ఉంటుంది. అగ్గి తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. సగటున హెక్టారుకు 7.0 నుంచి 7.5 టన్నులు దిగుబడి ఇస్తుంది.

ఎంటీయూ 1,232

నాటిన 15 రోజుల నుంచి పిలకలు కట్టే దశ వరకు సుమారు 15 రోజుల పాటు ముంపును ఈ వంగడం తట్టుకుంటుంది. దీని పంటకాలం 135 – 140 రోజులు. దోమపోటు, అగ్గితెగులు, మాగుడు తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. సగటున దిగుబడి హెక్టారుకు 6.0 – 6.5 టన్నులు.

ఈ వంగడం బ్రీడర్ విత్తనం మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయని, 30 కిలోల విత్తన సంచి ధర రూ.2,334గా నిర్ణయించారని, విత్తనం కావాల్సిన రైతులు పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు కార్యాలయంలో లేదా డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త (విస్తరణ) వారిని ఫోన్ 98481 41939 నంబర్‌లో సంప్రదించాలని డాక్టర్ ఫణికుమార్ సూచించారు.

క్లుప్తంగా

నిబంధనలకు విరుద్ధంగా టోల్ వసూలు



పంచాయతీ ముద్రతో వాహనానికి టోల్ వసూలు చేసిన రశీదు

కుక్కునూరు : ఏజెన్సీ ప్రాంతంలో పీసా నిబంధనలకు వ్యతిరేకంగా మండలంలోని పెద్దరావిగూడెం పంచాయతీలో జామాయిల్ నర్సరీలకు సంబంధించి వాహనాలకు ఆర్ అండ్‌బీ రహదారిపై టోలు వేలంపాటను నిర్వహించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని తొండిపాక, గణపవరం, పెద్దరావిగూడెం పరిధిలోని జామాయిల్ నర్సరీలో మొక్కలు తీసుకెళ్లే వాహనాలకు టోలు వసూలు చేయడం పీసా నిబంధనలకు విరుద్ధమన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా పేపర్ ప్రకటన లేకుండా వేలంపాటను ఎలా నిర్వహిస్తారని ధ్వజమెత్తారు. ఈ విషయమై వెంటనే అధికారులు స్పందించి టోల్ వసూళ్లను నిలిపివేయాలని లేనిపక్షంలో ఐటీడీఏ పీవో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆయన హెచ్చరించారు.

గురుకులాల్లో సీట్లు పెంచాలంటూ ధర్నా



ఏలూరులో ధర్నా చేస్తున్న బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో పేద ఎస్సీ విద్యార్థులకు సీట్లు పెంచాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొండపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ఎంఎస్సీ అధ్యక్షులు కందుల రమేష్ మద్దతు తెలియజేసి మాట్లాడారు. ఎస్సీ పేద పిల్లలకు అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఆరోతరగతిలో ప్రవేశ పరీక్ష లేకుండా సీట్లు పెంచి పేద విద్యార్థులకు విద్యను అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ఎక్కుతూ జారిపడి వృద్ధురాలి మృతి



ఏలూరు టౌన్ : నెల్లూరులో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కొయ్యమాదారం గ్రామానికి చెందిన ఎనుముల వెంకటేశ్వరమ్మ (60) తన గ్రామం నుంచి ఏలూరు వచ్చింది. ఏలూరులో నివాసం ఉంటున్న ఆమె చిన్నాన్న ముంగర వెంకన్నతో కలిసి నెల్లూరులోని కుమార్తెను చూసేందుకు బయలుదేరారు. ఏలూరు పెద్దరైల్వే స్టేషన్ 3వ ప్లాట్‌ఫామ్‌పై ట్రైన్ నెంబర్ 12863 యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందింది. ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైస్కూల్ హెచ్‌ఎం తీరుపై గగ్గోలు

- 20 రోజుల క్రితమే మహిళా టీచర్లు డీఈఓకు ఫిర్యాదు
- సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా కానరాని చర్యలు
- డీవైఈఓ వద్ద క్షమాపణ కోరినా మారని హెచ్‌ఎం ప్రవర్తన

నూజివీడు : పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్ సత్యనారాయణ తీరుపై పాఠశాలలో పనిచేస్తున్న మహిళా టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. హెచ్‌ఎం తమతో ప్రవర్తిస్తున్న తీరుపై, అనుచిత వ్యాఖ్యలపై వారు తీవ్ర మనస్తాపానికి గురై 20 రోజుల క్రితమే జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. అలాగే ఈనెల ఒకటో తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసంలో సైతం హెచ్‌ఎం తీరుపై, అనుచిత ప్రవర్తనపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీని అందజేశారు. అయినా ఇప్పటివరకు హెచ్‌ఎంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై మహిళా టీచర్లలో ఆవేదన వ్యక్తమవుతోంది. నూజివీడులోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో 800 మందికి పైన విద్యార్థినులుండగా 35 మంది మహిళా టీచర్లు పనిచేస్తున్నారు. హెచ్‌ఎం వీవీఎస్ సత్యనారాయణ మహిళా టీచర్లతో దురుసుగా వ్యవహరించడం, అనుచితంగా మాట్లాడుతూ బాధించడం నిత్యకృత్యమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ బాధ తాళలేక టీచర్లందరూ డీఈవోకు లేఖ ద్వారా ఫిర్యాదు చేయడానికి సిద్ధమవ్వగా హెచ్‌ఎం వారిలో ఒక్కొక్కరిని పిలిచి బెదిరించారు. ఈ విషయాన్ని డిప్యూటీ డీవైఈవో దృష్టికి తీసుకెళ్లగా క్షమాపణ కోరి ఇక నుంచి జాగ్రత్తగా ఉంటానని హెచ్‌ఎం హామీ ఇచ్చారు. ఆ తరువాత కూడా ఏమాత్రం మార్పు రాకపోవడంతో మహిళా టీచర్లందరూ ఏలూరు వెళ్లి డీఈవోకు ఫిర్యాదు చేశారు. అయినా హెచ్‌ఎం ప్రవర్తనలో మార్పు లేదు. అంతేగాకుండా పదవీ విరమణ చేయనున్న ఉపాధ్యాయినుల ప్రతిపాదనలను పంపనని బెదిరిస్తుండటం గమనార్హం. టీచర్ల పట్లే కాకుండా పాఠశాలలో పనిచేసే ఆయాలపై కూడా హెచ్‌ఎం అనుచిత వాఖ్యలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హెచ్‌ఎం ప్రవర్తన వల్ల ప్రతిరోజూ మానసిక స్థైర్యాన్ని కోల్పోయి నిత్యం భయపడుతూ విధులు నిర్వహించాల్సి వస్తోందని, తమకు తగు న్యాయం చేయాలని అర్జీలో కోరారు.

ఆర్‌జేడీ దృష్టికి తీసుకెళ్లాం

నూజివీడులో బాలికల హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం విషయం నా దృష్టికి వచ్చింది. హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవడానికి నాకు అధికారం లేనందున విషయాన్ని ఆర్జేడీ కాకినాడ వారి దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై విచారణ నిమిత్తం అధికారిని నియమించినట్లు తెలిపారు. విచారణ అనంతరం అధికారి నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

– అబ్రహం, డీఈవో, ఏలూరు జిల్లా

'పీఎం సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోండి



ఏ సత్యనారాయణ

నూజివీడు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ కోరారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన పథకాల వివరాలను వెల్లడించారు. సౌర విద్యుత్ వాడకాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకానికి డివిజన్లో మంచి స్పందన లభిస్తోందన్నారు. నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు ఏడాదికి రూ.15 వేల ఆదాయం అందించడమే లక్ష్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి 13న దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఇంటి పైకప్పు(రూఫ్ టాప్)పై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తును వినియోగించుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను డిస్కంలకు విక్రయించుకోవచ్చని తెలియజేశారు.

ఎలా నమోదు చేసుకోవాలంటే..

సూర్య ఘర్ పథకంలో లబ్ధి పొందాలంటే ముందుగా నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ వినియోగదారుడి కనెక్షన్ నంబర్, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ నమోదు చేయాలి. నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి. తర్వాత వినియోగదారుని సర్వీస్ నంబర్, మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి రూఫ్‌టాప్ సోలార్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆరు నెలల విద్యుత్ బిల్లుల కాపీలు జత చేయాలి. అనుమతులు వచ్చాక డిస్కంలోని విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తర్వాత ప్లాంట్ వివరాలు పోర్టల్‌లో సమర్పించి నెట్ మీటరుకు దరఖాస్తు చేసుకోవాలి. అది కూడా ఇన్‌స్టాల్ చేసిన తరువాత డిస్కమ్ అధికారులు పరిశీలించి పోర్టల్ నుంచి రిపోర్ట్ ఇస్తారు. వినియోగదారుని బ్యాంకు ఖాతా వివరాలు, చెక్కును పోర్టల్‌లో సబ్‌మిట్ చేస్తే 30 రోజుల్లో రాయితీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

స్థలం ఎంత ఉండాలంటే...

కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి ఇంటి పైకప్పుపై 10 చదరపు మీటర్ల స్థలం ఉండాలి. ఇందుకు గాను రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చవుతుంది. రాయితీపై రూ.30 వేలకే అందుతుంది.

రాయితీలు ఇలా..

ఒక్కో కుటుంబానికి 3 కిలోవాట్ల వరకు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ మంజూరు చేస్తారు. దీనికి రూ.1.45 లక్షలు ఖర్చు అవుతుంది. రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. దీని రిజిస్ట్రేషన్‌కు జాతీయ పోర్టల్ ప్రారంభించారు. ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన ప్లాంట్ చేసుకుంటే రూ.78 వేలు రాయితీ ఇస్తారు. ముందుగా వినియోగదారుడే ఖర్చు భరించాలి. స్తోమత లేని వారికి సులభ వాయిదాలలో బ్యాంకులో రుణం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అనంతరం రాయితీ సొమ్మును లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాకు జమ చేస్తుంది.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన యర్రసాని ఆంజనేయులకు జూన్ 30వ తేదీ ఉదయం మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వచ్చిందన్నారు. అయితే ఆంజనేయులు ఆ మెసేజ్‌కు రెస్పాండ్ అవ్వలేదని, అయినప్పటికీ అతని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అకౌంట్ నుంచి మొదటిసారి రూ.5 వేలు, రెండో సారి రూ.30 వేలు కట్ అయ్యాయన్నారు. దీనిపై బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

కలుపు నివారణపై శ్రద్ధ చూపాలి



ముదినేపల్లిలోని ఓ విత్తన షాపులో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా

ముదినేపల్లి రూరల్: వెదజల్లిన సార్వా వరి పొలాల్లో కలుపు నివారణకై రైతులు శ్రద్ధ చూపాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా సూచించారు. మండలంలోని ముదినేపల్లి, పెయ్యేరు, పేరూరు, సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో బుధవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. విత్తనాలు వెదజల్లు పద్ధతిలో కలుపు సమస్య తీవ్రంగా ఉంటుందన్నారు. దీనివల్ల వరి పైరును తెగుళ్లు, పురుగులు ఆశించి నష్టపరిచే ప్రమాదముందన్నారు. ఈ కలుపును ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించాలని కోరుతూ అందుకు తగిన సూచనలు చేశారు. భూసారాన్ని పెంచి చౌడును తగ్గించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇందుకోసం 50 శాతం సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట సాగు విత్తనాలను సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా 6,367 క్వింటాళ్ల జీలుగ, 2,566 క్వింటాళ్ల పిల్లిపెసర, 2,555 క్వింటాళ్ల జనుము విత్తనాలు సరఫరా చేయగా ముదినేపల్లి మండలంలో 212 క్వింటాళ్ల జీలుగ, 122 క్వింటాళ్ల పిల్లిపెసర, 53 క్వింటాళ్ల జనుము విత్తనాలు సబ్సిడీపై సరఫరా చేశామన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించారు. సింగరాయపాలెంలో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించి వ్యవసాయ సహాయకులకు తగిన సూచనలు చేశారు. మండలంలోని విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. జేడీఏ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, కల్తీ పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. స్థానిక విత్తనాల దుకాణంలో రికార్డులు సక్రమంగా నిర్వహించని కారణంగా రూ.22 వేల విలువైన 5 క్వింటాళ్ల వరి విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి, ఏఓ బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తణుకు: కాల్దరి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రైలు నుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉండవచ్చని, తెలుపు రంగు చొక్కా, నీలం, తెలుపు, పచ్చగళ్ల లుంగీ ధరించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి జేబులో నిడదవోలు నుంచి వేంద్ర వరకు తీసుకున్న టికెట్ లభించిందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 70939 39777 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. భీమవరం రైల్వే ఏఎస్సై పీటీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నేభవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఆక్వా రైతుల కృషి వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో, విదేశీ మారక ద్రవ్యం రూపంలో రూ.వేల కోట్లలో ఆదాయాలు పొందుతున్నా ఆక్వా రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ రాయితీ, నాణ్యమైన సీడ్స్ సరఫరా, ఫీడ్ ధరల నియంత్రణ వంటి అనేక హామీలు సక్రమంగా అమలు కాలేదన్నారు. రొయ్యలు కొనుగోలు చేసే బడా సంస్థలు సిండికేట్‌గా మారి ఆక్వా రైతులకు సరైన ధరలు రాకుండా చేస్తున్నారని, దీనివల్ల రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆక్వా రైతుల పట్ల చిన్నచూపు చూస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎంపెడా, ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం, మత్స్య శాఖ ఆక్వా రైతుల సమస్యలను పట్టించుకుని పరిష్కారం చెయ్యాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆక్వా సమస్యలపై రైతులు చేసే ఉద్యమాలకు రైతు సంఘం జిల్లా కమిటీ తరుపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని శ్రీనివాస్ తెలియజేశారు.

న్యాయం జరగకపోతే ఆమరణ దీక్షలు

గణపవరం: సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగిస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలకు దిగుతామని సీపీఎఫ్ ఉద్యోగులు ప్రకటించారు. బుధవారం 26వ రోజు ఉద్యోగులు తమ ఆందోళనను ఫ్యాక్టరీ వద్ద కొనసాగించారు. ఫ్యాక్టరీ ప్రధాన గేటువద్ద తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. కార్మిక శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులకు తమ మొరవినిపించుకున్నా ఇంతవరకూ యాజమాన్యంలో స్పందనలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ఉద్యోగుల పోరాట సమితి సమావేశమై ఆమరణ నిరాహార దీక్షలకు పిలుపు ఇస్తామని ఉద్యోగ సంఘాల నేతలు ప్రకటించారు.


తణుకులో మినిస్టర్ వైట్ షోరూం ప్రారంభం



తణుకులో మినిస్టర్ వైట్ షోరూం ప్రారంభిస్తున్న రామస్వామి

తణుకు: వస్త్ర ప్రపంచంలో సంప్రదాయాలకు అనుగుణంగా దుస్తులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మినిస్టర్ వైట్ పేరుతో మార్కెట్‌కి ప్రవేశించినట్లు సంస్థ సీఈఓ రామస్వామి చెప్పారు. తణుకులోని వేల్పూరు రోడ్డులో బుధవారం మినిస్టర్ వైట్ షోరూం ప్రారంభించి ఆయన మాట్లాడారు. తమిళనాడు నుంచి కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్రలతో పాటు ఆంధ్రలో మినిస్టర్ వైట్ బ్రాండ్‌ను పరిచయం చేసేందుకు రెండో షోరూమ్‌గా తణుకులో ప్రారంభించినట్లు చెప్పారు. మొట్టమొదటిది తిరుపతిలో ప్రారంభించినట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలో ఇప్పటి వరకు 16 షోరూమ్‌లు ఏర్పాటు చేశామని, 5 వేల మంది డీలర్లకు మినిస్టర్ వైట్ బ్రాండ్ దుస్తులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే ప్రతి మోడల్, డిజైన్లను సామాన్య వస్త్ర ప్రేమికులకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో మినిస్టర్ వైట్ బ్రాండ్ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో మరో 13 షోరూమ్‌లు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఏఎస్ఎంలు జహిరుద్దీన్, కుమార్, సుందర్ పాల్గొన్నారు.

ఆంధ్రా దివ్యాంగుల క్రికెట్ కార్యవర్గం ఏర్పాటు



అత్తిలిలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

అత్తిలి: రాష్ట్రంలో దివ్యాంగుల క్రికెట్ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ కోరారు. డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అత్తిలి గ్రామంలో డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర మొదటి వార్షిక సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి 13 జిల్లాల దివ్యాంగుల క్రికెట్ కమిటీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2024–27 వరకు ఎన్నికైన ఆంధ్రా దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు ప్రకటించారు. డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర గౌరవ అధ్యక్షునిగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు, అధ్యక్షునిగా బీవీ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షునిగా యడ్లపల్లి సూర్యనారాయణ, సెక్రటరీగా జీఆర్ఎల్ సూర్యనారాయణరాజు, జాయింట్ సెక్రటరీగా జి కైలాష్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు మధుసూదన్‌నాయక్, శ్రీకాంత్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా డీవీ దుర్గారావు, ప్లేయర్స్ అడ్మినిస్ట్రేటర్ షేక్ నాగూర్‌హుస్సేన్, ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్ పి.అనుపమ, సలహాదారులుగా కేవీవీ సత్యనారాయణ, వై.అయ్యప్పస్వామి ఎన్నికయ్యారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

సాక్షి స్పందన



శ్రీరామ్‌నగర్ 3వ వీధిలో డ్రైయినేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు రూరల్ : శనివారపుపేట శ్రీరామ్‌నగర్‌లో బుధవారం ఉదయం నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ పరిశీలించారు. 'శ్రీరామ్‌నగర్‌లో పారిశుధ్యం అస్తవ్యస్తం' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై కమిషనర్ స్పందించారు. 1 నుంచి 5వ రోడ్డు వరకు ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సమయంలో 1వ రోడ్డు శివారున డ్రెయినేజీ పక్కనే అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్న బేకరి దుకాణాన్ని తక్షణం సీజ్ చేయాలని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతిని ఆదేశించారు. మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగిస్తున్న గవరవరం చెరువులో పిచ్చిమొక్కలను పొక్లెయిన్‌తో తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీరు సక్రమంగా పారేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సమాధానాలు చెప్పలేకే బీజేపీ నిరసనలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజనాల రామ్మోహనరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : కాంగ్రెస్ నేత, పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో బీజేపీని, ప్రధాని మోదీని వివిధ అంశాలపై ప్రశ్నించినందుకు సమాధానం చెప్పలేక ఆయా అంశాలను, ప్రజలను పక్కదోవ పట్టించేందుకే బీజేపీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు విమర్శించారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నాన్ని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాయన్నారు. డీ మోనిటైజేషన్ నుంచి ఇప్పటివరకు మోదీ ప్రభుత్వం చేసిన అఘాయిత్యాలకు మోదీని దేశ బహిష్కరణ చెయ్యాలన్నారు. సమస్యలను పరిష్కరించటం మానేసి ప్రశ్నించే గొంతు నొక్కాలని మోదీ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సాదే బాబు ప్రసాద్, లంకా రామ్మోహన్, దాసరి రాంప్రసాద్, కొమ్మన సాంబశివరావు, దండుబోయిన చంద్రశేఖర్, కేఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2516]

Wanted

■ Required Primary Telugu, English Teachers High School English, Science Teachers. Eluru. Contact : 91546 47363. [P-749604]

■ రొయ్యల కంపెనీలో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్(M)కావలెను. గుడివాడ, అమలాపురం, మచిలీపట్నం ఏరియాలలో అర్హత:ITI, Dip, B.Tech, జీతం:13k-15k పెట్రోలు. PF, ESI. 9115456456, 8847017891 [G-795876]

■ ఏలూరులోని షాపింగ్ మాల్‌కి 5 సం. అనుభవం గల Male సెక్యూరిటీ సూ.వై, గార్డ్స్ (Only ఏలూరు వారు) కావలెను. జీ:16000/14000 + PF, ESI 12 గం.లు, డ్యూటీపై ఫ్రీ మీల్స్ ✆ 94412 39336 [B-782116]

■ ఇన్సులెన్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసు కోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000- 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. ఫోన్ 8817512185 [HA-328]

■ డ్వాక్రామహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొనికొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారుచేసి మాకు ఇవ్వండి. గ్రూప్‌లకు ఉచిత శిక్షణ. 9491995565 [H-796122]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185232]

■ ఆఫీస్‌స్టాఫ్& ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కావలెను. Age : 30 to 50 Years Qlf: MBA, MCA, B.Tech, Degree. Work Place: భీమవరంటౌన్. J.P.Road. సంప్ర: 88851 12000. [NA-11144]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K సంప్ర : 9640258899, 9640468899 [H-796175]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పని చేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-13695]

■ నర్సులు–GNM & ANM ,B.Sc Nursing, Pharmacist & ల్యాబ్ టెక్నీషియన్స్ కావలెను. అనురాధ పాలీ క్లినిక్, కార్డియాక్ డయాబెటిస్ కేర్ సెంటర్ విజయనగర్ కాలని, పంటకాలువ హైస్కూలు రోడ్డులో 4 రోడ్ల జంక్షన్ దగ్గర, పటమట, విజయ వాడ-10 ✆ 74165 47443 ,94403 53367 [B-145]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



ఎమ్మెల్యే రాధాకృష్ణను అభినందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

తణుకు: తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో బుధవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందించాలని కోరారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి హయాంలో తణుకు నియోజకవర్గం వ్యవసాయ యాంత్రీకరణలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉందని ప్రస్తుతం అదే ఒరవడి కొనసాగించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలను నాటుతున్న ఎంఈఓ హనుమ, హెచ్‌ఎం ఎం.సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛంద సేవా సంస్థలు అందజేసిన వివిధ రకాల మొక్కలను బుధవారం ఎంఈఓ హనుమ, పాఠశాల హెచ్‌ఎం మైనం సత్యనారాయణలు నాటారు. హనుమ మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. మొక్కలను నాటడం, వాటిని పరిరక్షించడం తప్పనిసరిగా చేయాలని, అత్యధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షించుకునేందుకు, ఆక్సిజన్ లెవిల్స్ పెరిగేందుకు, మొక్కలు అవసరం ఎంతైన ఉందని, విద్యార్థులు ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

చురుగ్గా నాలుగులైన్ల రహదారి విస్తరణ



విస్తరించిన రహదారి

తాడేపల్లిగూడెం: పెంటపాడు శివాలయం నుంచి తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన చేపట్టిన నాలుగు లైన్ల రహదారి విస్తరణలో భాగంగా మిగిలిన పనులకు నిధులు విడుదలయ్యాయి. వీటిని వినియోగించుకొని కోడేరు నల్లజర్ల రోడ్డులో రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉద్యానవర్సిటీ సమీపంలో తాడిపూడి కాలువపై ఉన్న వంతెనను నాలుగులైన్ల రహదారి కోసం విస్తరిస్తున్నారు. పాత వంతెన రెయిలింగ్‌ను తొలగించి విస్తరిస్తున్నారు. గూడెం నుంచి నల్లజర్ల వైపునకు కుడి పక్కన వంతెన విస్తరణ ముగిసింది. రెండో వైపు పనులు సాగుతున్నాయి. ఈ పనుల కోసం 18 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్టు తెలిసింది.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



అత్తిలి రైల్వేస్టేషన్ రోడ్డులో మొక్కలు నాటుతున్న ఉమర్ ఆలీషా పీఠం సభ్యులు

అత్తిలి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఉమర్ ఆలీషా పీఠం కన్వీనర్ యర్రంశెట్టి పుల్లారావు అన్నారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం అత్తిలి రైల్వేస్టేషన్ రోడ్డులో మొక్కలు నాటారు. ఈసందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు రెడ్డి వెంకటేశ్వరరావు, మారియ్య తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి అండగా నిలవాలి

ఉండి: చేతి వృత్తుల వారికి ప్రభుత్వం అండగా నిలవాలని నాయీబ్రాహ్మణుల సంఘం ఉండి నాయకులు అన్నారు. ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తన వంతు సహకారం మీకందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు మల్లువలస హరికృష్ణ,కార్యదర్శి మల్లువలస హరీష్ తదితరులు తెలిపారు.

విద్యుత్ బిల్లులు.. మారిన చెల్లింపులు

- ఏపీఈపీడీసీఎల్ సైట్‌లో కట్టే అవకాశం
- యూపీఐ యాప్‌లకు చెక్ పెట్టిన ఆర్బీఐ
- అందుబాటులోకి 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్



ప్రత్యక్ష చెల్లింపులు చేయాలని విద్యుత్ శాఖ సమాచారం

తణుకు: విద్యుత్ బిల్లులను ఇకపై సంస్థకే నేరుగా చెల్లించాలని ట్రాన్స్‌కో ప్రకటించింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఏపీఈపీడీసీఎల్ సైట్ లేదా ఈస్టర్న్ పవర్ యాప్‌లో మాత్రమే బిల్లు పేమెంట్ చేయాలని స్పష్టం చేసింది. యూపీఐ యాప్‌లైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో బిల్లు చెల్లించే ఆప్షన్‌ను నిలిపివేసి నట్లు వెల్లడించింది. విద్యుత్‌శాఖ కార్యాలయానికి నేరుగా వెళ్లి చెల్లిస్తే మేలని వినియోగదారులకు సూచిస్తోంది. సాధారణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు నిర్దేశిత గడువు తర్వాత కూడా యాప్‌లో చెల్లించే అవకాశం ఉంటోంది. ఇకపై ఇలా చేయడం కుదరదని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆర్‌బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్ నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

ఆర్‌బీఐ నిబంధనలు

సమయపాలన పాటిస్తూ గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించే కాలం పోయింది. గతంలో కంటే ప్రస్తుతం ఆన్‌లైన్ వాడకం పెరిగింది. ఎల్‌టీ సర్వీసులు అధిక భాగం బిల్లులు మొత్తం ఆన్‌లైన్‌లోని యూపీఐ ద్వారా చెల్లిస్తున్నారు. మొదట్లో లావాదేవీలను ప్రోత్సహించాలని యాప్‌లో సర్వీసు చార్జీలు వసూలు చేసేవారు కాదు. కానీ, గత ఏడాది నుంచి నామమాత్రపు చార్జీలను యూపీఐ యాప్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయితే జూలై 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు లైసెన్స్ అవసరమని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్స్ పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం బిల్ పేమెంట్ ఆప్షన్ తొలగించేశాయి.

కారణం ఇదీ..

ఆన్‌లైన్ చెల్లింపుల్లో మూడో పార్టీ యాప్స్ అయిన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో కరెంటు బిల్లు చెల్లిస్తే విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడానికి మూడు రోజులు సమయం పడుతోంది. అలాగే కొన్ని పేమెంట్స్ పలు కారణాలతో నిలిచిపోతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడం ఆలస్యమవుతోంది. అదే ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లు చెల్లిస్తే నేరుగా సంస్థ ఖాతాలోకే వస్తోంది. దీంతో యూపీఐ యాప్స్‌లో నగదు చెల్లించినా, నేరుగా ఏపీఈపీడీసీఎల్ ఖాతాలో జమ కావాలని ఆర్‌బీఐ నిబంధన విధించింది. అందులో భాగంగా యాప్స్ యాజమాన్యాలు పలు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అవి పూర్తయ్యాక పాత విధానం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం గూగుల్‌ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న easternpower అనే యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని నేరుగా బిల్లులు చెల్లించుకోవచ్చు. వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలనుకుంటే www.apeasternpower.com ద్వారా పేమెంట్ చేసుకునే అవకాశం ఉంది.

80 శాతం ఆన్‌లైన్

తణుకు సబ్ డివిజన్‌పరిధిలోని అత్తిలి, ఇరగవరం, తణుకు రూరల్, తణుకు టౌన్, తణుకు డీ2 సబ్‌స్టేషన్ల పరిధిలోని దాదాపు 80 శాతం వినియోదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. సబ్ డివిజన్‌లో గృహ, వాణిజ్య సర్వీసులు దాదాపు 1.12 లక్షల వరకు ఉన్నాయి. ఇవి కాకుండా హెచ్‌టీ, పరిశ్రమల సర్వీసులు 418 వరకు వినియోగిస్తున్నారు. ఇవి కాకుండా 2,225 ప్రభుత్వ సర్వీసులు కాగా 1,263 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం విద్యుత్ బిల్లుల ద్వారా సబ్ డివిజన్‌లో నెలకు రూ. 30 కోట్లు వస్తోంది. ఇందులో రూ. 14.34కోట్లు గృహ, వాణిజ్యసర్వీసులు ద్వారా మిగిలిన రూ. 15 కోట్లు పరిశ్రమలు, హెచ్‌టీ సర్వీసుల ద్వారా వస్తోంది. పరిశ్రమల చెల్లింపులు బ్యాంకు ద్వారా చేస్తున్నారు. మిగిలిన వాటిలో 80 శాతం మంది ఆన్‌లైన్ ద్వారా కడుతున్నారు.

విద్యుత్ బిల్లులు ఇలా చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులను easternpower మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్ www.apeasternpower.com ద్వారా చెల్లించాలి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాల మేరకు ఇకపై వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎమ్‌లతోపాటు ఇతర యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే అవకాశం లేదు. వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డుల ద్వారా కూడా విద్యుత్ బిల్లును చెల్లించవచ్చు.

– సీహెచ్ రామకృష్ణ, ఏడీఈ, తణుకు సబ్‌డివిజన్

జగన్‌ను కలిసిన సంపత్‌కుమార్



వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను కలిసిన ఏఎంసీ మాజీ చైర్మన్ సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిగూడెం ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గూడెంలో పార్టీ స్థితిగతులను జగన్‌కు ఆయన వివరించారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని పార్టీ అధినేత జగన్ ధైర్యం చెప్పారు. రాబోయే కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంసిద్ధంగా ఉండాలని సూచించినట్లు తెలిసింది.

అతిసారంపై అప్రమత్తం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో సీజనల్ వ్యాధులు, అతిసారాపై వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండపాక గ్రామంలోని వడ్డీల వీధిలో ఆరోగ్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది ఇంటింటికి తిరిగి అతిసారా నివారణకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు పలు ఆరోగ్య సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనంతలక్ష్మీ, వైటీ మూర్తి, సంధ్య, అనూరాధ, ఆశా వర్కర్లు కుమారి, పద్మావతి, విజయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి వేడుకలు



ఎస్వీ రంగరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఎస్వీఆర్ సర్కిల్‌లో ఎస్వీ రంగారావు జయంతిని బుధవారం సేవా సమితి అధ్యక్షుడు భోగిరెడ్డి రాము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, తెదేపా ఇంచార్జ్ వలవల బాబ్జి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మార్నీడి బాబ్జి, నాయకులు హాజరై రంగారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్వీ రంగారావుకు భారతరత్న ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మెకానిక్ దినోత్సవం

ప్రపంచ మెకానిక్ దినోత్సవాన్ని స్థానిక ఎస్వీఆర్ సెంటర్‌లో బుధవారం మెకానిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ పెరుగుతున్న సందర్భంలో నూతన టెక్నాలజీపై శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని, కలెక్టర్‌తో మాట్లాడి వెహికల్స్ మరమ్మతుల్లో శిక్షణ ఇప్పిస్తానని చెప్పారు. సంఘ అధ్యక్షుడు కొమ్మిశెట్టి వెంకటరాజు, పసుపులేటి సత్యనారాయణ, నల్లమోలు మోహన్ పాల్గొన్నారు.

హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్లకు అభినందనలు: ఏపీ హైకోర్టు (అమరావతి) ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులైన తాడేపల్లిగూడెంకు చెందిన న్యాయవాది యెలిశెట్టి సోమరాజును ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తదతరులు అభినందించారు.

అల్లూరు సత్యనారాయణ జీవితం ఆదర్శనీయం



తాడేపల్లిగూడెం: అల్లూరు సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



తణుకు: సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అల్లూరు సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమని పలువురు సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సీఐటీయూ వ్యవస్థాపకులు, సీఐటీయూ ఉద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ 10వ వర్ధంతి సభ బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నిర్వహించారు. అల్లూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లలర్పించారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, చింతకాయల బాబూరావు, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి తదిరులు పాల్గొన్నారు.

అల్లూరు సత్యనారాయణ వర్ధంతి కార్యక్రమం

తణుకు: కార్మిక వర్గం కోసం జీవితాంతం పోరాటం సాగించిన వ్యక్తి ఉద్యమనేత అల్లూరు సత్యనారాయణ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. బుధవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద అల్లూరు సత్యనారాయణ పదో వర్ధంతి కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే దేశభక్తి అలవర్చుకున్న సత్యనారాయణ పేదలు, కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం సాగించారని అన్నారు. అసంఘటిత కార్మికులను ఐక్యం చేసి వారికి యూనియన్లు ఏర్పాటు చేసేలా కృషి చేశారని గుర్తు చేశారు. సీఐటీయూ సీనియర్ నాయకులు గార రంగారావు, పి.దక్షిణామూర్తి, సీఐటీయూ జిల్లా నాయకులు గుబ్బల గోపి, దుర్గాప్రసాద్, గోవిందరాజు, ఎస్.ఆదినారాయణబాబు, రమేష్, మందులయ్య, టి.వెంకటేశ్వరరావు, బంగారమ్మ, ఉష పాల్గొన్నారు.

తెలుగు భాషకు వెంకటావధాని సేవలు ప్రశంసనీయం



యండగండిలో ఆచార్య వెంకటావధాని జయంతి వేడుకలను నిర్వహిస్తున్న గ్రామ ప్రముఖులు

ఉండి: తెలుగుకు భాష కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన ప్రముఖమైన వారిలో ఆచార్య దివాకర్ల వెంకటావధాని ఒకరని, ఆయన సేవలు ప్రశంసనీయమని యండగండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవి కుమార్ అన్నారు. బుధవారం వెంకటావధాని 112వ జయంతి వేడుకలను యండగండిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన శత జయంతి వేడుకల సందర్భంగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఏర్పాటు చేసిన విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తెలుగు సాహితీ సంపదను ప్రపంచానికి అందించిన మహోన్నత వ్యక్తి వెంకటావధాని అని అన్నారు. ఆయన యండగండి వాసి కావడం తమకు చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వేగేశ్న రామరాజు, దామర్తి అప్పారావు, దండు సూర్యనారాయణ రాజు, పేరిచెర్ల సత్యనారాయణరాజు, జర్నలిస్టు బంగార్రావు, కన్నా శివన్నారాయణ, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆవులకు వ్యాక్సిన్



సిద్ధాపురంలో ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ కె.జనార్ధన్‌రావు

ఆకివీడు: ఆవులను రక్షించుకునేందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కె.జనార్ధన్‌రావు తెలిపారు. మండలంలోని సిద్ధాపురంలో ముద్ద చర్మ వ్యాధి నివారణకు, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ ఇటీవల ఆవులకు లంపీ స్కిన్ డిసీజ్ (ముద్ద చర్మ వ్యాధి) ఎక్కువగా వస్తుందన్నారు. సకాలంలో వైద్యం అందక, వ్యాధి తీవ్రతతో ఆవులు, దూడలు చనిపోతున్నాయన్నారు. వాటి రక్షణ కోసం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ అందజేస్తున్నామని చెప్పారు. ఈ వ్యాధి రాకుండా 4 నెలల దూడ నుంచి పెద్ద ఆవుల వరకూ టీకాలు వేస్తున్నామన్నారు. నెల పాడవునా ఆయా గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి వ్యాక్సిన్ అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల పశు సంవర్ధకశాఖ అధికారిణి భార్గవీ సత్య, రైతు నాయకుడు బీహెచ్.తిమ్మరాజు, రైతులు పాల్గొన్నారు.

డ్రెయిన్ పూడికతోనే నారుమడుల ముంపు

వ్యవసాయాధికారులు



నారుమళ్లు పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ సంధ్య తదితరులు

ఉండి: మండలంలో ముంపునకు గురైన నారుమళ్లను వ్యవసాయాధికారులు ఏడీఏ కేఏఎస్ఎస్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారిణి బి.సంధ్య బుధవారం పరిశీలించారు. యండగండి మీడియం డ్రెయిన్ పూడిక పనులు చేపట్టకపోవడంతో ఉప్పులూరు, యండగండి, చిలుకూరు గ్రామాల్లో 350 ఎకరాలకు సరిపడా 17.5 ఎకరాల నారుమళ్లు ముంపునకు గురయ్యాయి. దీంతో వ్యవసాయాధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. నారుమడుల్లో నీరు బయటకు రాకపోవడంతో దెబ్బతింటున్నాయని డ్రెయిన్ పరిస్థితిని ఉన్నతాధికారులతో పాటు డ్రెయినేజ్ అధికారులకు కూడా తెలిజేస్తామని ఏడీఏ తెలిపారు. రైతులు నారుమళ్లు వేసుకునే సమయంలో మెరక భూములను ఎంచుకోవాలని అప్పుడు ముంపు సమస్య నుంచి సాధ్యమైనంత వరకు తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.మేఘన, ఎం.మహేంద్రి, టి.ఝాన్సీ, రైతులు పాల్గొన్నారు.

లాటరీలో రైతుకు వెండి బహుమతి

భీమవరం (ప్రకాశంచౌక్): గత రబీ సీజన్‌లో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన గ్రోమోర్ రైతు సంబరాల్లో భాగంగా గ్రోమోర్ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు లాటరీ నిర్వహించారు. ఈ లాటరీలో పెనుమంట్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన కొడమంచిలి కనకరత్నానికి 50 గ్రాముల వెండి బహుమతిగా లభించింది. ఈ బహుమతిని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి సీహెచ్ డీవీ గుప్తా, కోరమాండల్ మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



ఇరగవరం మహిళ సమైక్య భవనంలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఇరగవరం: ప్రతి మహిళ వ్యాపారాలు చేస్తూ ఆర్థిక ప్రగతి సాధించాలని ఏపీఎం టి.పుష్పవతి అన్నారు. బుధవారం ఇరగవరం మహిళ సమైక్య భవనంలో వివోఏలకు శిక్షణ కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘల్లో ఉన్న ప్రతి సభ్యురాలు ఏదో ఒక వ్యాపారం చేయాలన్నారు. పేదరికం పోవాలి అంటే మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు గూడాల అనురాధ, సూర్యనారాయణ, కంప్యూటర్ అపరేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం మంచిది కాదు

తాడేపల్లిగూడెం: పర్యావరణ పరిరక్షణకోసం ప్లాస్టిక్ వాడకం మంచిది కాదని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ కోరారు. పర్యావరణంపై దుష్ప్రభావం కలిగించే వాటిని వదిలి పునర్వినియోగబ్యాగ్లు వంటి వాటిని వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్.యూనిట్ ఇన్‌చార్జి కేవీఎస్ ఎస్.రాజు, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్స్‌డే వేడుకలు



అత్తిలిలో టూవీలర్ సృష్టికర్త గాట్లిబ్ డైమ్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మెకానిక్‌లు

అత్తిలి: ప్రపంచ మెకానిక్స్ దినోత్సవాన్ని వల్లీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి మోటారు సైకిల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అత్తిలిలో ఘనంగా నిర్వహించారు. టూవీలర్ సృష్టికర్త గాట్లిబ్ డైమ్లర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో మెకానిక్‌లు బైక్ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో మోటారు సైకిల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టేకు శ్రీను, ఉపాధ్యక్షుడు చెరుకువాడ ప్రభు, యడ్లపల్లి నాగు, షేక్ వలీ, సాయిబాబా, నాగేశ్వరరావు, సాయి, టీడీపీ, జనసేన మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, దాసం ప్రసాద్, పోలిశెట్టి చంటి, కొరిపల్లి హరి పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలో వర్షాలు కురుస్తున్నందున, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమలు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, దోమ తెరలు తప్పక వాడాలని పలు సూచనలు చేశారు. పట్టణ ప్రజలు నిల్వ ఉన్న, ఈగలు వాలుతున్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల జ్వరం, వాంతులు, విరోచనాలు వంటి అనారోగ్య సమస్యలు వస్తాయని, పట్టణ ప్రజలు ఎవరైనా కాలానుగుణ వ్యాధులకు గురైతే పురపాలక సంఘంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు తెలిపాలన్నారు. కాల్ సెంటర్ నెంబర్ 08818-224188ను సంప్రదించాలని కోరారు. కాచి చల్లార్చి, వడబోసిన నీటిని మాత్రమే తాగవలెనని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.P.No.14/2024

పిటీషనర్ : [illegible]
మరియు
రెస్పాండెంట్స్ : 1) [illegible]
2) [illegible]
3) [illegible]

పిటీషనర్ వేయించిన ప్రకటన

[illegible]

షెడ్యూల్

[illegible]

M.PRATAP KUMAR B.Sc.,L.L.B.
Advocate
ARAVALLI(POST)-534230, Attili (M), W.G.DIST.,
Cell:98489 64821

Place: TANUKU
Date:03.07.2024

హిందువులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

పెనుగొండ: హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యకారిణి కానూరి అర్జునరావు డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బుధవారం పెనుగొండలో తీవ్ర నిరశన వ్యక్తం చేశారు. దేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు అన్నదమ్ముల్లా కలిసి కట్టుగా ఉంటున్న తరుణంలో రాహుల్ వ్యాఖ్యలు విఘాతం కల్గిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ అందర్నీ ఒకే కంటితో చూస్తుందన్నారు. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్న రాహుల్ గాంధీ హిందువుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

రచయిత అడబాల లక్ష్మీనారాయణకు సత్కారం

వీరవాసరం: పుస్తక రచయిత, దర్శకుడు అడబాల లక్ష్మీనారాయణ (రాజు)కు గౌరవ డాక్టరేట్ వచ్చిన సందర్భంగా వీరవాసరంలో బుధవారం ఘనంగా సత్కరించారు. సత్కార గ్రహీత రాజు మాట్లాడుతూ ప్రముఖ రచయిత, దర్శకుడు, నటులు తనికెళ్ల భరణి సలహా మేరకు, గురువు వర్ధినీడి సురేష్ కోరిక మేరకు రచించిన మా రాయకుదురు గ్రామ చరిత్రను ×చరిత్ర లో మా ఊరు₹ పుస్తకానికి ఊహించలేని గౌరవం దక్కిందని తెలిపారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు తెలుగు లిటరేచర్ (రీసెర్చ్) విభాగంలో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందన్నారు. గౌరవ డాక్టరేట్ పొందిన లక్ష్మి నారాయణను వీరవాసరం కళా పరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, కళారంజని అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, శ్రీకృష్ణ దేవరాయ నాటక కళా పరిషత్ కమిటీ, గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామ చంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com